**జరిగిన కథ :** కన్యాకుబ్జాన్ని పాలించే తాళ ధ్వజునికి ఇరవైమంది కుమారులు. వారందరూ ఐదుగురు చొప్పున తూర్పు, ఉత్తర దిగ్విజయ యాత్రలు చేస్తున్నారు. ఇప్పుడు మూడో విడత శ్రీముఖుడు, విక్రముడు, విజయుడు, చిత్రభానుడు, నలుడు.. పశ్చిమ దిగ్విజయ యాత్రకు బయల్దేరారు. కొంకణ, టెంకణ, సౌరాష్ట్ర మొదలైన దేశాధిపతులను జయించారు. మహారాష్ట్రంలో ప్రవేశించారు.



కాశీ మజిలీ కథలు 78

# వరుణద్వీపంలో దేవకన్యలు

అనుసృజన:
**నేతి సూర్యనారాయణ శర్మ**

మహారాష్ట్ర దేశాధిపతి శ్రీధరుడు. ఆయన తన కూతురైన కమలావతికి స్వయంవరం చాటించాడు. ఆ వార్త విన్న కన్యాకుబ్జ రాకుమారులు కూడా ఆ దేశ రాజధాని ఉమాపురానికి వెళ్లారు. రాజశాసనం ప్రకారం అధికారులు.. స్వయంవరానికి వచ్చిన వారందరినీ తగిన విడిదులలో ప్రవేశపెట్టారు. ప్రతివారి వంశనామాలను, బిరుదాలను జాబితా రాసుకుని వెళ్లారు.

శ్రీధరుడు పూర్వాచార పరాయణుడు. క్షత్రియ వంశ మర్యాద ప్రకారం కూతురికి స్వయంవరం ప్రకటించాడు. ఎంపిక చేసిన కొన్ని రాజ్యాల వారికి ప్రత్యేకంగా లేఖలు రాసి, స్వయంవరానికి ఆహ్వానించాడు. అయితే కమలావతి సుగుణాలరాశి, అందాలభరిణ, విద్యలలో సాటిలేనిది. దాంతో ఆహ్వానాలు లేకున్నా.. కొంతమంది రాకుమారులు.. శ్రీముఖుడు మొదలైనవారిలాగా తమంతట తామే స్వయంవరానికి తరలివచ్చారు.

మహారాజు అధికారులు తీసుకొచ్చిన జాబితాలను వడబోశాడు. స్వయంవరానికి రావచ్చునంటూ ఉత్తములకు మాత్రమే ఆహ్వానాలు పంపాడు. తన స్థాయికి సరిపడని వారికి కొన్ని కానుకలిచ్చి.. విడిది నుంచే తిరిగి వెళ్లాల్సిందనీ, స్వయంవరానికి రానవసరం లేదనీ లేఖలు రాయించాడు. శ్రీముఖుడు మొదలైన కన్యాకుబ్జ రాకుమారులకు కూడా లేఖలు వెళ్లాయి.

'రాజపుత్రులారా! మీ రాజ్యం ఏమూల ఉందో మాకు తెలియదు. అంతేకాకుండా మీకు మేము ఆహ్వాన పత్రికలు పంపలేదు. కనుక ఈ లేఖతోపాటు కానుకలను స్వీకరించి, మీ స్వస్థలాలకు తిరిగి వెళ్లవచ్చు. ఇలా రాసినందుకు మాపై కోపగించవద్దు'.. అని ఉందా లేఖలలో.

లేఖలను చదువుకున్న శ్రీముఖునికి, అతని సోదరులకు విపరీతమైన కోపం కలిగింది.

''లోకంలో రాజులందరూ తమ కూతుళ్లకు స్వయంవరాలు ఇలాగే జరిపిస్తున్నారా?! వచ్చినవారిని సభకు ఆహ్వానించాలి. వధువుకు నచ్చకపోతే తిరస్కరించాలి. అంతేకానీ, ముందుగానే సభకు రాకూడదని నిషేధాజ్ఞలు పంపడం సమంజసమేనా?! తమ్ముళ్లూ! దీనికి మనం ప్రతీకారం చేయాల్సిందే!'' అన్నాడు శ్రీముఖుడు.

అందరూ 'సై అంటే సై' అన్నారు.

స్వయంవరం రోజు రానేవచ్చింది. ఐదుగురూ అశ్వాలను అధిరోహించి సభాభవనానికి వెళ్లారు. కరవాలాలు చేతబూని గుర్రాలపై నుంచి ఒక్కమారే కిందికి ఉరికారు.

నలుగురు తమ్ముళ్లూ నాలుగువైపులా కాపు కాస్తుండగా శ్రీముఖుడు ముందుకు నడిచాడు. అడ్డువచ్చిన వారిని నిర్జించి, సభామంటపంలోకి దూసుకువెళ్లాడు. వరమాల చేతపట్టుకుని, ఆహూతులైన రాకుమారుల చరిత్రలను వింటున్న కమలావతి నడుము చుట్టూ చేతులు వేసి, భుజాలమీదికి ఎత్తుకున్నాడు. సభలోని వారంతా హాహాకారాలు పెడుతుండగా బయటికి నడవసాగాడు.

కొందరు ఆయుధాలు ధరించి ఎదుర్కొన్నారు. చూస్తుండగానే వారంతా ఆ అన్నదమ్ముల చేతిలో ఓడిపోయి పారిపోయారు. చివరికి శ్రీధర మహారాజు స్వయంగా ఆయుధం పట్టాడు. అతణ్ని కూడా ఆ అన్నదమ్ములు చిత్తుగా ఓడించి, బందీగా పట్టుకున్నారు.

''రాజా! నీలో పస ఇంతమాత్రమేనా? ఈమాత్రం దానికే మావంటి వారిని నిషేధించి, అపకీర్తి మూటకట్టుకున్నావు కదా!'' అని ఎద్దేవా చేశారు.

అందుకు శ్రీధరుడు..

''రాజపుత్రులారా! నాకిప్పుడు విచారం లేదు. నా కుమార్తెకు సర్వసమర్థుడైన వరుణ్నే ఎంపిక చేయాలన్న నా అభీష్టం నెరవేరింది. రుక్మిణీదేవిని శ్రీకృష్ణుడు చేపట్టినట్లుగా.. రాక్షసపద్ధతిలో నువ్వు నా కుమార్తెను చేపట్టావు. నేను సంతోషంగానే ఉన్నాను'' అని పలికాడు.

దాంతో అతని కట్లు విప్పివేశారు. శ్రీధరుడు తన అల్లుణ్ని, అతని తమ్ముళ్లను భద్రగజాలపై కూర్చోబెట్టి విడిదికి తీసుకువెళ్లాడు. నాలుగురోజుల వ్యవధిలో శ్రీముఖునికి, కమలావతికి అంగరంగ వైభవంగా వివాహం జరిగింది. ఆ వివాహ వేడుకలో తన అల్లుళ్ల వీరత్వాన్ని గురించి శ్రీధరుడు నలుగురికీ గొప్పగా చెప్పుకోసాగాడు.